ఐఎంపీసీఎల్ ప్రైవేటీకరణపై నిరసన జ్వాలలు

- లాభాల్లో ఉన్నప్పటికీ సంస్థను అమ్మేస్తున్నారు
- కేంద్రంపై ఉద్యోగుల ఆగ్రహం

అల్మోరా, అక్టోబర్ 7: ఇండియన్ మెడిసిన్స్ ఫార్మాసూటికల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఎంపీసీఎల్) ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన తీవ్రమైంది. ఉత్తరాఖండ్‌లోని అల్మోరాలో గల ఆ కంపెనీ ఎదుట వందలాది మంది ఉద్యోగులు కొన్ని రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. లాభాల్లో ఉన్న ఈ ప్రభుత్వ రంగ సంస్థను బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తమతో సంప్రదించకుండా, తమ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తూ అమ్మేస్తున్నదని ఉద్యోగులు ఆరోపించారు. 'మా నిరసన ఓ కంపెనీని అమ్మడం గురించి కాదు. భారత ఆయుర్వేద పరిశ్రమ భవిష్యత్తును అమ్మడం గురించి' అని ఓ నిరసనకారుడు తెలిపారు. 500 మందికి పైగా ఉద్యోగులు, ఔషధాల తయారీకి ముడి సరుకులు సరఫరా చేసే వేలాది మంది సన్నకారు రైతులు ఈ కంపెనీపై ఆధారపడ్డారని.. ఇలాంటి విలువైన కంపెనీని ఎంపిక చేసిన స్నేహితులకు ఎందుకు కట్టబెడుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ అధీనంలో ఆయుర్వేద, యునానీ మందులను ఉత్పత్తి చేస్తూ భారత సంప్రదాయ వైద్య విధానాన్ని ప్రచారం చేస్తున్న ఐఎంపీసీఎల్ ఏటా స్థిరంగా లాభాలు పొందుతున్నది.

ఎల్జీకి ఐదుగురు సభ్యుల్ని నామినేట్ చేసే అధికారం

- జమ్ముకశ్మీర్ ఎన్నికల ఫలితాల వేళ వివాదం
- సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామన్న విపక్షాలు

న్యూఢిల్లీ: మరికొద్ది గంటల్లో జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలు చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర అసెంబ్లీకి ఐదుగురు సభ్యుల్ని నామినేట్ చేసే అధికారం ఎల్జీకి ఉండటం రాజకీయంగా కీలకంగా మారింది. ఎట్టి పరిస్థితిలో దీనిని అంగీకరించబోమని కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలు సోమవారం ప్రకటించాయి. సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని తెలిపాయి. జమ్ము కశ్మీర్ అసెంబ్లీలో మెజార్టీ మార్క్ 48 ఏ ఒక్క పార్టీకి రాకపోవచ్చని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. దీంతో ఎల్జీ తన అధికారాల్ని వినియోగిస్తారా? ప్రభుత్వం ఏర్పాటయ్యాక క్యాబినెట్ సలహా మేరకు సభ్యుల్ని నామినేట్ చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఎల్జీ నామినేట్ చేసేవారు తమ పార్టీ నుంచే ఉంటారని బీజేపీ పేర్కొన్నది.

నేడు హర్యానా, జమ్ము కశ్మీర్ ఎన్నికల ఫలితాలు

చండీగఢ్, శ్రీనగర్: హర్యానా, జమ్ము కశ్మీర్ శాసనసభ ఎన్నికల ఫలితాలు నేడు వెల్లడి కానున్నాయి. రెండు చోట్లా కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల ప్రధానాధికారులు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ రెండు చోట్ల బీజేపీ-కాంగ్రెస్ ముఖాముఖి తలపడుతున్నాయి. హర్యానాలో ఫలితాలపై రాజకీయ పార్టీలు, నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. హ్యాట్రిక్ విజయంపై బీజేపీ ధీమా వ్యక్తం చేస్తుండగా... పదేండ్ల తర్వాత అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ చెప్తున్నది. మరోవైపు 370 అధికరణ రద్దు తర్వాత తొలిసారి జమ్ము కశ్మీర్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయంపై బీజేపీ, పీడీపీ, కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటములు ధీమాగా ఉన్నాయి.

మైక్రో ఆర్ఎన్ఏ ఆవిష్కర్తలకు వైద్య నోబెల్

విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌కు అవార్డు • ఇద్దరూ అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలే

స్టాక్‌హోమ్: మైక్రోఆర్ఎన్ఏను కనుగొన్న అమెరికా శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌కు వైద్య శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం లభించింది. సోమవారం నోబెల్ కమిటీ ఈ అవార్డును ప్రకటించింది. జన్యు క్రియను క్రమబద్ధీకరించే ప్రాథమిక సూత్రం మైక్రో ఆర్ఎన్ఏనే అనే విషయాన్ని వీరు గుర్తించారు. జీవులు ఎలా అభివృద్ధి చెందుతాయి, ఎలా పని చేస్తాయనే ప్రాథమిక అంశాన్ని వీరి ఆవిష్కరణ నిరూపించిందని నోబెల్ అసెంబ్లీ ప్రకటించింది. విక్టర్ ఆంబ్రోస్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ మెడికల్ స్కూల్‌లో నాచురల్ సైన్స్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. రవ్‌కున్ హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో జెనెటిక్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి 10 లక్షల డాలర్ల(రూ.84 కోట్లు) నగదు బహుమతి అందనుంది. డిసెంబర్ 10న ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా వీరు అవార్డు అందుకోనున్నారు. వీరితో వైద్యశాస్త్రంలో నోబెల్ పురస్కారం అందుకున్న వారి సంఖ్య 227కు చేరుకోనుంది. కాగా, కొవిడ్-19కు ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు అభివృద్ధి చేసిన అమెరికన్ శాస్త్రవేత్త డ్రూ వెయిస్‌మెన్, హంగేరీ అమెరికన్ కటలిన్ కరికోకు గత ఏడాది మెడిసిన్‌లో నోబెల్ పురస్కారం దక్కిన సంగతి తెలిసిందే.

జన్యు నియంత్రణ గుట్టు విప్పిన మైక్రో ఆర్ఎన్ఏ

జన్యు క్రియను నియంత్రించడంతో కీలక పాత్ర పోషించే సూక్ష్మ ఆర్ఎన్ఏ అణువులను ఆంబ్రోస్, రవ్‌కున్ కనుగొన్నారు. వీరి ఆవిష్కరణ జన్యు నియంత్రణలో కొత్త సిద్ధాంతాన్ని తెలిపింది. ప్రొటీన్ల తయారీ సూచనలను కలిగి ఉండే మెసెంజర్ ఆర్ఎన్ఏకు మైక్రోఆర్ఎన్ఏ భిన్నమైనవి. నిర్దిష్ట ఎంఆర్ఎన్ఏ అణువులు ప్రొటీన్లుగా పరివర్తన చెందకుండా మైక్రో ఆర్ఎన్ఏ నియంత్రిస్తాయి. కణాల అభివృద్ధి, జీవక్రియలోనూ మైక్రోఆర్ఎన్ఏ కీలకపాత్ర పోషిస్తాయి. మైక్రోఆర్ఎన్ఏ పనితీరులో ఆటంకాలకు క్యాన్సర్ వంటి వ్యాధులతో సంబంధం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కణాల మధ్య భేదాన్ని కనుగొనడం, వాటి అభివృద్ధి, వ్యాధి ప్రక్రియలను మరింత మెరుగ్గా అర్థం చేసుకోవడంలో మైక్రో ఆర్ఎన్ఏ ఉపయోగపడనుంది.

ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం

- దాడి చేసిన హమాస్, హెజ్బొల్లా, హౌతీ
- టెల్ అవివ్, హైఫా నగరాలపై దాడి
- దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు
- ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధానికి ఏడాది

జెరూసలేం, అక్టోబర్ 7: ఇజ్రాయెల్‌పై గాజా నుంచి హమాస్, లెబనాన్ నుంచి హెజ్బొల్లా, యెమెన్ నుంచి హౌతీ రాకెట్లవర్షం కురిపించాయి. టెల్ అవీవ్ నగరం లక్ష్యంగా హమాస్ రాకెట్లను ప్రయోగించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లోని మూడో పెద్ద నగరమైన హైఫాను లక్ష్యంగా చేసుకొని హెజ్బొల్లా భారీ ఎత్తున రాకెట్లతో దాడి చేసింది. దక్షిణ హైఫాలోని ఇజ్రాయెల్ మిలిటరీ బేస్‌ను లక్ష్యంగా చేసుకొని 'ఫది 1' మిసైళ్లను ప్రయోగించినట్టు హెజ్బొల్లా ప్రకటించింది. తైబెరియాస్‌పై దాడి చేసినట్టు తెలిపింది. హెజ్బొల్లా ప్రయోగించిన రాకెట్లు హైఫాను తాకినట్టు ఇజ్రాయెల్ పోలీసులు ధ్రువీకరించారు. ఈ దాడిలో 10 మంది గాయపడ్డట్టు స్థానిక మీడియా తెలిపింది. అయితే, లెబనాన్ నుంచి హెజ్బొల్లా 135 రాకెట్లను ప్రయోగించగా, అడ్డుకున్నామని ఇజ్రాయెల్ మిలిటరీ తెలిపింది. మధ్య ఇజ్రాయెల్ లక్ష్యంగా యెమెన్ నుంచి పేల్చిన క్షిపణిని సైతం అడ్డుకున్నట్టు పేర్కొన్నది. మరోవైపు దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై బాంబులు వేసినట్టు ఇజ్రాయెల్ తెలిపింది. గాజాలోని జబాలియా శరణార్థ శిబిరంతో పాటు పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ ఘటనలో 12 మంది పాలస్తీనా వాసులు మరణించారు. కాగా, ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 10 మంది అగ్నిమాపక సిబ్బంది సహా 22 మంది మరణించినట్టు లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది.

హైఫాలో రాకెట్ దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రెస్క్యూ సిబ్బంది

గాజా పునర్నిర్మాణానికి దశాబ్దాలు

గాజాలో హమాస్‌తో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమై ఏడాది గడిచింది. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిపి 1,200 మందిని హతమార్చడం, 251 మందిని బందీలుగా తీసుకెళ్లడంతో ఈ యుద్ధం ప్రారంభమైంది. హమాస్ దాడికి ప్రతీకారంగా వెంటనే గాజాపై ఇజ్రాయెల్ వైమానిక, భూతల దాడులను ప్రారంభించింది. ఇవి ఏడాదికాలంగా కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో గాజాస్ట్రిప్ చిన్నాభిన్నమైంది. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. లక్షల సంఖ్యలో ఇండ్లు నేలమట్టమయ్యాయి. తమ ఇండ్లు ఎక్కడున్నాయో కూడా ప్రజలు గుర్తుపట్టలేని స్థాయిలో విధ్వంసం జరిగింది. గాజా పునర్నిర్మాణానికి దశాబ్దాలు పట్టే అవకాశం ఉంది. మరోవైపు హమాస్‌తో పాటు హెజ్బొల్లా, హౌతీలు, ఇరాన్ చేస్తున్న వైమానిక దాడులతో ఇజ్రాయెల్ సైతం నష్టపోతున్నది.

ఇరాన్ అణు పరీక్షలు?

ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అణ్వాయుధ తయారీ దిశగా ఇరాన్ ప్రయత్నాలను ముమ్మరం చేసిందనే అనుమానాలు కలుగుతున్నాయి. తాజాగా అణు పరీక్షలు జరిపిందని నిపుణులు భావిస్తున్నారు. అక్టోబరు 5న ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో సంభవించిన భూకంపానికి అణుపరీక్షలే కారణమని అనుమానిస్తున్నారు. కాగా, ఊహించిన దాని కంటే వేగంగా ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయగలదని తాజాగా ది హెరిటేజ్ ఫౌండేషన్ పేర్కొన్నది. ఇరాన్ చాలా ఏండ్లుగా అణ్వాయుధాల తయారీకి ప్రయత్నిస్తున్నప్పటికీ పాశ్చాత్య దేశాలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

బందీలందరినీ వెనక్కు తీసుకొస్తాం: నెతన్యాహూ

అక్టోబర్ 7 దాడికి ఏడాది గడిచిన సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కీలక వ్యాఖ్యలు చేశారు. గాజాలో బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలు అందరినీ వెనక్కు తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. 'మన పిల్లలు, వారి భవిష్యత్తు కోసం అక్టోబర్ 7 లాంటి ఘటన మళ్లీ జరగకుండా చూసేందుకు మన ప్రాంతంలో భద్రత వాస్తవిక పరిస్థితులను మారుస్తున్నాం' అని ఆయన వ్యాఖ్యానించారు.

గుజరాత్‌లో 120 కోట్ల కొకైన్ పట్టివేత

ఒకే ప్రాంతంలో.. ఇది మూడోసారి

గాంధీధామ్, అక్టోబర్ 7: గుజరాత్‌లోని కచ్ తీర ప్రాంతంలో రూ.120 కోట్ల విలువైన కొకైన్ పట్టుబడింది. గాంధీధామ్‌కు సమీపంలోని క్రీక్ అనే చోట 12 కిలోల కొకైన్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు సోమవారం వెల్లడించారు. స్మగ్లర్లు పట్టుబడకుండా ఉండటం కోసం ఈ కొకైన్ ప్యాకెట్లను అత్యంత రహస్యంగా ఓ చోట దాచి ఉంచారని తాము భావిస్తున్నట్టు పోలీస్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. 'గాంధీధామ్‌కు సమీపంలో క్రీక్ అనే ప్రాంతంలో కొకైన్ పట్టుబడటం ఇది మూడోసారి. చిన్న ఉపాయంతో దీన్ని పట్టుకున్నాం. ఆదివారం రాత్రి ఇక్కడ సోదాలు నిర్వహించగా 10 కొకైన్ ప్యాకెట్లు బయటపడ్డాయి' అని అన్నారు. తదుపరి దర్యాప్తు చేపడుతున్నట్టు చెప్పారు. గత ఏడాది సెప్టెంబర్, ఈ ఏడాది జూన్‌లో క్రీక్ ప్రాంతంలో పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుబడింది.

కోల్‌కతా వైద్యురాలిపై సంజయ్‌రాయ్ హత్యాచారం

సీబీఐ చార్జిషీట్‌లో వెల్లడి

కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతా డాక్టర్ హత్యాచార కేసులో సీబీఐ సోమవారం సీల్దాలోని ప్రత్యేక న్యాయస్థానంలో చార్జిషీట్‌ను దాఖలు చేసింది. 200మందికి పైగా వ్యక్తుల నుంచి వాంగ్మూలం తీసుకున్న సీబీఐ, ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌గా తేల్చింది. రాత్రి విరామ సమయంలో దవాఖాన సెమినార్ హాల్‌లోకి వెళ్లిన వైద్యురాలిపై సివిక్ వలంటీర్‌గా పనిచేస్తున్న సంజయ్ రాయ్ ఘాతుకానికి పాల్పడ్డాడని సీబీఐ తెలిపింది. గ్యాంగ్ రేప్ జరిగిందా? లేదా? మరికొంత మంది ప్రమేయం ఇందులో ఉందా? అన్నది తేల్చేందుకు ఇంకా దర్యాప్తు చేస్తున్నామని సీబీఐ పేర్కొన్నది. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, దవాఖానలో విధుల్లో ఉన్న వైద్యురాలిపై లైంగికదాడి, హత్య ఘటన పశ్చిమ బెంగాల్‌ను తీవ్రంగా కుదిపేసింది. ఆగస్టు 9న వెలుగుచూసిన ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది.

నాణ్యమైన పరిశోధనలకు ప్రోత్సాహం

పీహెచ్‌డీ ఎక్స్‌లెన్స్ పురస్కారాలు ఇవ్వనున్న యూజీసీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: పీహెచ్‌డీ పరిశోధనల్లో నాణ్యతను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా పీహెచ్‌డీ ఎక్స్‌లెన్స్ సైటేషన్ పురస్కారాలను అందించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిర్ణయించింది. పరిశోధనలకు అనుకూల వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు, నాణ్యమైన పరిశోధనలు చేసే యువ రిసెర్చ్ స్కాలర్‌లకు తగు గుర్తింపు ఇచ్చేందుకు ఈ పురస్కారాలను అందించనుంది. సైన్సెస్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, సోషల్ సైన్సెస్, భారతీయ భాషలు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టుల్లో అవార్డులను అందించనుంది. దేశంలోని కేంద్ర, రాష్ట్ర యూనివర్సిటీలతో పాటు ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేసిన వారు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేయొచ్చు. ప్రతియేటా ఒక్కో సబ్జెక్టు నుంచి రెండు చొప్పున 10 పురస్కారాలను అందించనున్నారు. ఇందుకోసం యూనివర్సిటీలే ఒక్కో సబ్జెక్ట్ నుంచి ఒక్కొటి చొప్పున ఐదు నామినేషన్లను పంపించవచ్చు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం రోజు పురస్కారాలను అందిస్తారు.

కెనడా పోస్ట్ స్టడీ వర్క్ ప్రోగ్రామ్‌లో మార్పులు

నవంబర్ నుంచి అమలు

ఒట్టావా, అక్టోబర్ 7: పోస్ట్ గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్ (పీజీడబ్ల్యూపీ) ప్రోగ్రామ్‌లో నవంబర్ 1 నుంచి మార్పులు అమలు చేయనున్నట్టు కెనడా ప్రభుత్వ సంస్థ ఐఆర్‌సీసీ వెల్లడించింది. అభ్యర్థులు దరఖాస్తు చేసేటప్పుడు పీజీడబ్ల్యూపీకి అవసరమైన భాషా నైపుణ్యాలపై ఆధారాలు సమర్పించాలి. ఇంగ్లిష్ భాష కోసం కెనడియన్ లాంగ్వేజెస్ బెంచ్‌మార్క్(సీఎల్బీ)ను ఆధారంగా సమర్పించొచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా చదవడం, రాయడం, వినడం, మాట్లాడే విభాగాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించాలి. ఇందుకు సంబంధించి రెండేండ్ల లోపు పాత పరీక్ష ఫలితాలను మాత్రమే దరఖాస్తుతో పాటు జత పరచాలి. అదనంగా అభ్యర్థి తాను చదవాలనుకుంటున్న స్టడీ ప్రోగ్రామ్ కోసం, అందుకు సంబంధించిన వృత్తికి సంబంధం ఉన్న రంగంలో గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలి. అభ్యర్థి చదవాలనుకున్న రంగాలను వ్యవసాయం & వ్యవసాయోత్పత్తి వాణిజ్యం(అగ్రి-ఫుడ్), స్టెమ్ సబ్జెక్టులు, వాణిజ్యం, రవాణా అనే అయిదు విభాగాలుగా విభజించారు. పీజీడబ్ల్యూపీ ప్రోగ్రామ్‌లో కొత్త నిబంధనలతో పాటు కొన్ని పాత నిబంధనలను కూడా అమల్లో ఉంటాయి. పీజీడబ్ల్యూపీకి అర్హత పొందేందుకు అభ్యర్థులు తప్పనిసరిగా జనరల్, ఫిజికల్ లొకేషన్ అర్హతలను సాధించాలి.

సమోసా, పకోడీతో మధుమేహం!

ఐసీఎంఆర్ తాజా అధ్యయనం

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: భారతీయులు ఇష్టంగా తినే పలు ఆహార పదార్థాలు మధుమేహానికి కారణం అవుతున్నాయని తాజా అధ్యయనంలో తేలింది. సమోసా, పకోడీ, ఫ్రైడ్ చికెన్, చిప్స్, బిస్కెట్లు, కేక్స్, రెడీమేడ్ మీల్స్, మయోనైజ్, గ్రిల్ చికెన్, బీఫ్, డ్రై నట్స్, వేయించిన వాల్ నట్స్ వంటివి డయాబెటిస్ పెరిగేందుకు దోహదం చేస్తున్నాయని వెల్లడైంది. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ రిసెర్చ్, మద్రాస్ డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 38 మంది అధిక బరువు, స్థూలకాయంతో బాధపడుతున్న 25-45 ఏండ్ల వయస్కులను పరీక్షించగా వారిలో బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 23 కంటే అధికంగా ఉన్నదని తెలిసింది. దీనికి సంబంధించిన అధ్యయనం ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఫుడ్ సైన్సెస్ అండ్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైంది.

రైల్వే అధికారుల భర్తీకి యూపీఎస్సీ పరీక్ష

పాత పద్ధతిని పునరుద్ధరించిన కేంద్రం

న్యూఢిల్లీ: భారతీయ రైల్వేలో అధికారుల పోస్టుల భర్తీకి పాత పద్ధతినే అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్ష (సీఎస్సీ), ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష (ఈఎస్సీ)ల ద్వారా రైల్వే అధికారులను ఎంపిక చేయనున్నది. ఈ నిర్ణయానికి కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం ఆమోదం తెలిపింది. ఐదేండ్ల క్రితం ఎనిమిది రైల్వే సేవలను ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్ఎంఎస్)లో విలీనం చేసిన తరువాత అధికారుల పోస్టులన్నీ సీఎస్సీ పరీక్ష ద్వారానే భర్తీచేసేవారు. రైల్వేలో ప్రస్తుతం ఐఆర్ఎంఎస్‌లోని వివిధ విభాగాల్లో 225 ఖాళీలు ఉన్నాయి. సీఎస్సీ పరీక్ష ద్వారా జరిగే ఎంపికలో ఎక్కువ మంది సాంకేతికత లేని వారు భర్తీ అవుతుండటంతో సంస్థ అవసరాలు తీరడం లేదని తిరిగి పాత పద్ధతినే అనుసరించాలని రైల్వే శాఖ నిర్ణయించింది.

జార్కిహోళితో విజయేంద్ర భేటీ

- డీకే శివకుమార్ సోదరుడు సైతం..
- కర్ణాటకలో కీలక పరిణామాలు
- సీఎం మార్పు ప్రచారంతో రెండు భేటీలకు ప్రాధాన్యం

బెంగళూరు: ముడా కుంభకోణం నేపథ్యంలో కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందనే ప్రచారంతో రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సిద్ధరామయ్యను తప్పిస్తే తనను ముఖ్యమంత్రిని చేయాలని పట్టుబడుతున్న మంత్రి సతీశ్ జార్కిహోళితో సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర భేటీ అయ్యారు. మరోవైపు ముఖ్యమంత్రి పదవికి ప్రధానంగా పోటీ పడుతున్న డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ సైతం జార్కిహోళిని కలిశారు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ఊహాగానాలకు తెరలేశాయి. ప్రజా సమస్యలపై మాట్లాడటానికి మంత్రిని కలిసినట్టు ఇద్దరు నేతలు చెప్పినప్పటికీ అంతర్గతంగా ముఖ్యమంత్రి మార్పుపైనే చర్చ జరిగిందనే ప్రచారం జరుగుతున్నది. కాగా, ఇటీవల సతీశ్ జార్కిహోళి ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దలను కలిసొచ్చారు. సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తప్పిస్తే తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. డీకే శివకుమార్ అభ్యర్థిత్వాన్ని సతీశ్ వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో సయోధ్య కోసమే ఆయనతో డీకే సోదరుడు భేటీ అయ్యారనే ప్రచారం జరుగుతున్నది.

ముడా స్కామ్‌లో ఫైళ్లు మాయం!

మంత్రిపై ఫిర్యాదు చేసిన ఆర్టీఐ కార్యకర్త

బెంగళూరు, అక్టోబర్ 7: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్న ముడా కుంభకోణానికి సంబంధించిన కీలక దస్త్రాలు మాయమైనట్టు ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఆరోపించారు. సోమవారం ఆయన డీజీపీ అలోక్ మోహన్‌ను కలిసి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బైరాతి సురేశ్, లోకాయుక్త మాజీ ఎస్పీ సుజీత్‌పై ఫిర్యాదు చేశారు. వీరిద్దరు కలిసి జూలైలో ముడా కుంభకోణానికి సంబంధించిన కీలక దస్త్రాలను తరలించారని ఆయన ఆరోపించారు. ఈ స్కామ్ గురించి బయటకు వచ్చిన తరాత మంత్రి బైరాతి సురేశ్ హెలికాప్టర్‌లో మైసూరుకు వెళ్లి కీలక ఫైళ్లను తెచ్చారని, ఇందుకు సుజీత్ సాయపడ్డారని స్నేహమయి కృష్ణ పేర్కొన్నారు. కాగా, ముడా స్కామ్‌లో సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసులు, ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

బీఎస్ఎన్ఎల్ సేవలపై పార్లమెంట్ కమిటీ అసంతృప్తి

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ టెలికం సంస్థ 'బీఎస్ఎన్ఎల్' సేవల్లో నాణ్యత లోపించడంపై పార్లమెంట్ కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బీఎస్ఎన్ఎల్ సేవలు, పనితీరుపై సోమవారం బీజేపీ ఎంపీ సంజయ్ జైశ్వాల్ నేతృత్వంలో కమిటీ సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు ఎంపీలు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల నాణ్యతపై మాట్లాడారు. ఎంపీల ఫిర్యాదులపై స్పందించిన బీఎస్ఎన్ఎల్ సీఎండీ, టెలికం కార్యదర్శి.. ఆరు నెలల్లో మెరుగైన ఫలితాలు చూపుతామని తెలిపారు. 4జీ సేవల టవర్ల సంఖ్యను 24వేల నుంచి లక్షకు పెంచుతామని ఎంపీలకు తెలిపారు.

యూఎస్ ఓటర్లకు మస్క్ బంపరాఫర్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ టెస్లా బాస్ ఎలాన్ మస్క్ బంపరాఫర్ ప్రకటించారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆయుధ హక్కుకు మద్దతు నిచ్చే పిటిషన్‌పై సంతకం చేసే నమోదిత ఓటర్లు ప్రతి ఒక్కరికీ 47 డాలర్ల చొప్పున ఇవ్వనున్నట్టు ప్రకటించారు. అయితే, ఈ ఆఫర్ స్వింగ్ స్టేట్స్ (రెండు ప్రధాన రాజకీయ పార్టీలకు సమాన మద్దతు కలిగిన రాష్ట్రాలు) ఓటర్లకు మాత్రమే పరిమితం. యూఎస్ అధ్యక్ష ఎన్నికల్లో రెండోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ట్రంప్‌కు మద్దతుగా పలువురు టెక్ వ్యవస్థాపకులతో ఏర్పడిన మస్క్ అమెరికా పీఏసీ వెబ్‌సైట్‌లో ఈ పిటిషన్‌ను ప్రారంభించారు.

విద్యుత్తు ఉత్పత్తి చేసే కృత్రిమ మొక్క

- కార్బన్ డయాక్సైడ్‌ను ఆక్సిజన్‌గా మార్చగలదు
- అభివృద్ధి చేసిన అమెరికా శాస్త్రవేత్తలు

న్యూయార్క్, అక్టోబర్ 7: విద్యుత్తును ఉత్పత్తి చేసే కొత్త రకమైన కృత్రిమ మొక్కను అమెరికాలోని బింఘామ్టన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. బయోబ్యాటరీలతో పని చేసే ఈ మొక్క గదిలో పెట్టుకోవడానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇది కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకొని ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు కొంత మొత్తంలో విద్యుత్తును సైతం ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. పరిశోధనలో భాగంగా వీరు ఐదు ఆకులతో కూడిన కృత్రిమ మొక్కను తయారుచేశారు. దీని నుంచి దాదాపు 140 మైక్రోవాట్‌ల విద్యుత్తు తయారైనట్టు ప్రొఫెసర్ సియోక్యూన్ చోయ్ తెలిపారు. ఈ సాంకేతికతను మెరుగుపరిచి ఒక మిల్లీవాట్ కంటే ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి ప్రయత్నిస్తున్నామని, దీనికి లిథియం అయాన్ బ్యాటరీలను జత చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో దీని ద్వారా సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెట్టుకునే అవకాశం ఉండేలా మారుస్తామని తెలిపారు. సాధారణంగా బయట కంటే గదిలోనే కార్బన్ డయాక్సైడ్ ఎక్కువ ఉంటుందని, ఈ కృత్రిమ మొక్క గదిలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, ఆక్సిజన్‌గా మార్చడంలో బాగా పని చేస్తున్నట్టు చెప్పారు. ఈ క